క్లుప్తంగా

నేడు రైతు బజార్‌కు సబ్సిడీ టమాటాలు రాక

కడప అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న టమాటాలు శనివారం రెండు టన్నులు కడప రైతు బజార్‌కు వస్తున్నట్లు రైతు బజార్ మేనేజర్ నాయక్ తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఒక్కొక్కరికి కిలో చొప్పున మాత్రమే అందజేస్తామని తెలిపారు. వినియోగదారులు తప్పని సరిగా ఆధార్‌కార్డు వెంట తీసుకుని రావాలని తెలిపారు. కిలో 50 రూపాయల చొప్పున అందచేస్తామన్నారు.

25న విద్యా సంస్థల బంద్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 25న విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేజీ నుంచి పీజీ వరకు విద్యా సంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు సుబ్బరాయుడు, జయవర్ధన్, చెన్న కేశవ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక ఆదాయానికి గండి కొట్టడం తగదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ / కడప కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఆదాయానికి గండి కొట్టే ఎగ్జిబిషన్ టెండర్లను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, నగర కార్యదర్శి వెంకట శివ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్ పనులను సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 సంవత్సరంలో తిరుమల ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ద్వారా రూ. 45 లక్షలు వస్తే నేడు రూ. 15.75 లక్షలకు కారు చౌకగా ఎస్ హ్యాండ్లూమ్ హ్యాండీ క్రాఫ్ట్ ఫన్ పెయిర్ ఎగ్జిబిషన్ సంస్థకు కట్టబెట్టడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కెసీ బాదుల్లా, మద్దిలేటి, మనోహర్‌రెడ్డి, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సైన్సుపై అవగాహన పెంచుకోవాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే సైన్సుపై అవగాహన పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని వక్కలపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ స్కూల్ హెడ్ టీచర్ నజీముల్లా అన్నారు. అంతరిక్ష పరిశోధన దినం (స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ డే) సందర్భంగా విద్యార్థులకు సైన్సుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అబ్దుల్ కలాం లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు నడవాలన్నారు.

వీఆర్‌ఏల జీతం పెంచాలి

కడప సెవెన్‌రోడ్స్ : విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లకు జీతాన్ని రూ. 15 వేలకు పెంచాలని వీఆర్‌ఏ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్ కోరారు. శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ రొనాల్డ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. మనోహర్ మాట్లాడుతూ తరతరాలుగా వీఆర్‌ఏలుగా పనిచేస్తున్నప్పటికీ జీతాలు పెంచకపోవడం విచారకరమన్నారు. అర్హులైన వారికి వాచ్‌మెన్, అటెండర్, డ్రైవర్, వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ సంఘ నాయకులు యోగి మస్తాన్, రాజు, భూషణం, గురవయ్య, ఉదయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ. 10 వేలు చెల్లించి సబ్సిడీ కింద వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకులు చాంద్ బాషా, మద్దిలేటి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

23న రౌండ్ టేబుల్ సమావేశం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 23న ఉమ్మడి పౌర సంస్కృతిపై నగరంలోని సీపీఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పౌర సంస్కృతిని అమలు చేస్తామంటూ ప్రధాని మోదీ చేస్తున్న ప్రకటన రాజకీయ పూరితమైందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్ఎస్, హిందూత్వ ప్రణాళికతో పని చేస్తోందన్నారు.

డివిజన్ల అభివృద్ధికి కృషి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరంలోని డివిజన్ల అభివృద్ధికి పాలకులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని 15, 16, 1వ డివిజన్‌లలో కాంగ్రెస్ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులను ఆక్రమించి అక్రమ కట్టడాలను కట్టిన వాటిని తొలగించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు నజీర్ అహ్మద్, సత్తార్, చార్లెస్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బోధన, పరిశోధన విస్తృతికి కృషిచేయాలి

– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న వీసీ చింతా సుధాకర్

వైవీయూ : విశ్వవిద్యాలయంలో బోధన, పరిశోధన విస్తృతికి అధ్యాపకులు అందరూ కృషిచేయాలని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ సూచించారు. శుక్రవారం వైవీయూ పరిపాలన భవనంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అధ్యక్షతన అకడమిక్ అంశాలపై అన్ని శాఖల అధిపతులతో రిజిస్ట్రార్ ఆచార్య వై. వెంకటసుబ్బయ్యతో కలిసి వీసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సకాలంలో సిలబస్ పూర్తి చేయాలన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. విస్మరించే వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల హాజరుశాతం 75 శాతం ఉంటేనే పరీక్షలకు అనుమతించాలన్నారు. స్కాలర్లకు రీసెర్చ్ మెథడాలజీ క్లాసులు తీసుకోవాలని, హాజరుతప్పనిసరి అన్నారు. ప్రతి డిపార్ట్‌మెంట్ వారం రోజుల్లో వెబ్‌సైట్‌లో సమాచారాన్ని అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయం శాఖలకు ఇచ్చిన నిధులు సకాలంలో ఖర్చుచేయలేదని, ఇకపై అయినా ఖర్చుచేయాలని సూచించారు. అందరం కలిసి విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడదాం అని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శ్రీనివాస్, డీన్‌లు ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఆచార్య పి.ఎస్.షావల్లీఖాన్, ఆచార్య చంద్రమతీశంకర్, ఆచార్య పార్వతి, వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత భవన నిర్మాణాలు పూర్తి చేయాలి

– జేసీ గణేష్‌కుమార్


మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు తదితర ప్రాధాన్యత భవనాలను సెప్టెంబరు 15 నాటికి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు శ్రీనివాసులురెడ్డితో కలిసి శుక్రవారం కలెక్టరేట్ సభా భవనంలో ఈ అంశంపై ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని బద్వేలు, పులివెందుల నియోజకవర్గాల్లో భవన నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని, ఆగస్టు 15 నాటికి పూర్తవుతాయని పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి జేసీ దృష్టికి తీసుకు వచ్చారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గాల్లో కూడా నిర్దేశిత సమయంలోపు మొత్తం 279 భవన నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. జేసీ మాట్లాడుతూ భవన నిర్మాణాలకు ప్రతి వారం రూ. 75 కోట్లు విడుదల చేసేందుకు ఆర్థికశాఖ అనుమతించిందని వెల్లడించారు. సిమెంటుకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే స్థానికంగానే పరిష్కరించుకోవాలని సూచించారు. పేమెంట్స్ విషయంలో ఆందోళన పడాల్సిన అవసరం ఏమాత్రం లేదని స్పష్టం చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

– డీఆర్వో గంగాధర్‌గౌడ్


ఉద్యోగులు ఇచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్ : ఉద్యోగుల ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపి పరిష్కారమార్గం చూపుతామని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో డీఆర్వో అధ్యక్షతన ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేకంగా నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆయన అర్జీలను స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ శాఖల నుంచి ఉద్యోగులు తమ ఇంక్రిమెంట్లు, పే ఫిక్సేషన్, బదిలీలు, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్, పీఆర్సీ తదితర సమస్యలపై సుమారు 130 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ్‌కుమార్, ఎఫ్ సెక్షన్ సూపరింటెండెంట్ వెంకట రమణ, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

సేవకు సలాం



బాధ్యతగా విధులు

ఈ చిత్రంలోని వృద్ధురాలి పేరు మారిపల్లె జమయ్మ. కడప నగరంలోని 18వ వార్డులో ఓ చిన్న అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఈమెకు ఎలాంటి జీవనోపాధి లేదు. ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యంతోపాటు పింఛన్‌తో జీవనాన్ని గడుపుతోంది. అయితే ఈమెకు కొన్ని అనారోగ్య పరిస్థితుల కారణంగా ఇబ్బంది పడేది. ఆ వార్డు పరిధిలోని వలంటీర్ నాయక్ ఆ వృద్ధురాలి పరిస్థితి తెలుసుకున్నాడు. ఆమెకు ఆరోగ్య శ్రీ కార్డుకు దరఖాస్తు చేయించి మంజూరు చేయించాడు. ఆరోగ్యశ్రీ కార్డుతో ఆమె వైద్యం చేయించుకుంది. మరోవైపు వలంటీర్ ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలు అందుతుండడంతో ఆమె సంతోషం వ్యక్తం చేస్తోంది. – కడప ఎడ్యుకేషన్


జయమ్మకు ఆరోగ్యశ్రీ కార్డును అందచేస్తున్న వాలంటీర్ నాయక్

ఆరోగ్యశ్రీకార్డు మంజూరులో...



నాకు మొదట్లో ఆరోగ్య శ్రీ కార్డు ఉండేది కాదు. మా వార్డు వాలంటీర్ పూజారి నాయక్ నాకు ఆరోగ్యశ్రీకార్డును మంజూరు చేయించాడు. ఆయన చొరవ తోనే నాకు ఆరోగ్యశ్రీ కార్డు వచ్చింది. లేకపోతే చాలా ఇబ్బంది పడేదాన్ని. పథకాలు కూడా అందుతున్నాయి. వలంటీర్ సేవలు మరచిపోలేను. – మారిపల్లె జయమ్మ, 18 వార్డు, కడప

మూల్యాంకన నిధులను మంజూరు చేయాలి

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనానికి సంబంధించి ఉపాధ్యాయులకు చెల్లించ వలసిన రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని ఏపీ ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ రాఘవరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి సమాధాన పత్రాల మూల్యాంకన విధుల్లో పాల్గొన్న వారికి ఇంత వరకు రెమ్యూనరేషన్ మంజూరు చేయలేదన్నారు. అలాగే ఇటీవల బదిలీలు, ప్రమోషన్స్ నిర్వహించిన సందర్భంగా క్యాడర్ స్ట్రెంత్ సరిచేసి ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏపీ ఎస్టీయూ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, మురళీ, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ట్రెజరర్ శ్రీనివాసులు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలను చెల్లించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను సకాలంలో చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

మణిపూర్ ఘటనలో దోషులను శిక్షించాలి

కడప కార్పొరేషన్/ కడప రూరల్: మణిపూర్‌లో మహిళలను సామూహిక అత్యాచారం చేసిన వారిని ఉరితీయాలని మైనార్టీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ దస్తగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను ఉక్కుపాదంతో అణిచి వేయకుండా కేంద్రం చూస్తూ ఊరకుండడం సిగ్గుచేటన్నారు. మణిపూర్ అల్లరి మూకలను వెంటనే అరెస్ట్ చేయాలని సుప్రీం కోర్టు కేంద్రానికి చీవాట్లు పెట్టేవరకూ స్పందన లేకపోవడం దారుణమన్నారు.

మణిపూర్ మహిళల అత్యాచారాలను ఖండించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ఖండించాలని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బసీరున్నీషా పేర్కొన్నారు. శుక్రవారం మణిపూర్ ఘటనను ఖండిస్తూ నగర శివార్లలోని వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య నాయకురాళ్లు మున్నీ, విజయ, భాను పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

రాయచోటి అర్బన్ : గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని ఆర్‌డీఓ రంగస్వామి అన్నారు. శుక్రవారం ఆర్‌డీఓ అధ్యక్షతన లింగ నిర్ధారణ పరీక్షలపై డివిజనల్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు, క్లినిక్‌లు, వైద్యులతో మాట్లాడుతూ లింగనిర్ధారణ చేసే వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. అలాంటి స్కానింగ్ సెంటర్లు, క్లినిక్‌ల రిజిస్ట్రేషన్ రద్దుచేయడం, జరిమానాలు విధించడం, అవసరమైతే జైలుశిక్ష వేయడం లాంటి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. అధికారులు ఇచ్చే నివేదికలను బట్టి లింగ నిర్ధారణ చేసే క్లినిక్‌లపై నిఘా ఉంచి చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.మధుసూదన్ రెడ్డి, డీఐఓ ఉషశ్రీ, డిప్యూటీ డెమో దేవశిరోమణి, డీసీహెచ్‌ఎస్ చంద్రశేఖర్, వైద్యులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్

చింతకొమ్మదిన్నె : ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం చింతకొమ్మదిన్నె మండలం ప్రకాశంపల్లిలోని ఆశా ఫౌండేషన్ బధిరుల పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జగనన్న విద్యా కానుక కిట్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల సిస్టర్ జ్యోతిష్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా సమస్యలపై గవర్నర్‌కు వినతి

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో నూర్‌బాషా, దూదేకులు ఎదుర్కొంటున్న సమస్యలను గవర్నర్ అబ్దుల్ నజీర్ దృష్టికి తీసుకెళ్లినట్లు నూర్‌బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాయల్‌బాబు పేర్కొన్నారు. గురువారం రాత్రి రాజ్‌భవన్‌లో తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహ్మద్, గౌరవ సలహాదారులు నాగుల్ మీరా, పెదబాబులతో కలిసి గవర్నర్‌ను కలిశామన్నారు. పలు సమస్యలను ఆయనకు విన్నవించామన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో షేక్ బాజీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక సలీం, రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందాదుల్లా, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డా. మస్తానమ్మ, రాష్ట్ర యువజన అధ్యక్షుడు పెద్ద మస్తాన్ ఉన్నారు.

కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలి

– ఆర్‌ఎస్‌వైఎఫ్ ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట రాయలసీమ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఆర్‌ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కన్నెలూరు శంకర్, జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబులు మాట్లాడుతూ కళాశాలలు ప్రారంభమై రెండు నెలలైనా పాఠ్య పుస్తకాలు లేని కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇందువల్ల పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువ శాతం ఫెయిలయ్యే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఐదు ఎయిడెడ్ కళాశాలలు, మూడు మోడల్ స్కూళ్లు, 11 అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, 17 కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిల్లో 8051 మంది విద్యార్థులు చదువుతున్నారని పేర్కొన్నారు. అనంతరం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షుడు సోయాల్, నాయకులు ఆజాద్, రాఘవ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి

కడప అర్బన్: అరవింద్‌నగర్ 13/1 వార్డు సచివాలయంలో ప్లానర్ సెక్రటరీగా పనిచేస్తున్న రామమోహన్‌పై శుక్రవారం మృత్యుంజయకుంటకు చెందిన బాల అనే వ్యక్తి దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులను చేస్తుండగా, తాను వెళ్లి అలా చేయకూడదని చెప్పినందుకు తనపై దాడి చేశారని బాధితుడు పేర్కొన్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు చిన్నచౌక్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

సచివాలయం ప్రారంభం

ఒంటిమిట్ట (సిద్ధవటం) : మండలంలోని గంగపేరూరు గ్రామంలోని గ్రామ సచివాలయ భవనాన్ని, వైఎస్‌ఆర్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల నూతన భవనాలను శుక్రవారం రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డిలు ప్రారంభించారు.

భూ సర్వేపై రైతులకు అవగాహన

చెన్నూరు : వైఎస్సార్ జగనన్న భూ రక్ష భూ రీసర్వేను డ్రోన్‌ష్టి ద్వారా చేపట్టి రైతుల భూ హద్దులను నిర్ణయిస్తున్నామని మండల సర్వేయర్ సోమశేఖర్ తెలిపారు. శుక్రవారం చెన్నూరు మండలం రామనపల్లి గ్రామ సచివాలయంలో రైతులకు వైఎస్సార్ జగనన్న భూ రక్ష భూ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
రామనపల్లి గ్రామానికి సంబంధించి 12 వందల 62 ఎకరాల 73 సెంట్లల్లో రీ సర్వే నిర్వహించామన్నారు. రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ గతంలో భూ సర్వేకి సంబంధించి రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వారని, ప్రస్తుతం అలాంటి బాధలు లేకుండా ప్రభుత్వమే రైతుల వద్దకు వచ్చి వారి భూమికి సరిహద్దులు చూపిస్తోందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శాంతమ్మ, విలేజ్ సర్వేయర్ వెంకటశివారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మట్కా జోలికి వెళితే చర్యలు

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో మట్కా నిర్వహిస్తు పట్టుబడిన నిందితులకు శుక్రవారం స్టేషన్‌లో సీఐ సయ్యద్ హాసం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గతంలో మట్కా కేసుల్లో వున్న వారు, ప్రస్తుతం మట్కా జోలికి మరళా వెళితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో మట్కా రాస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాదకరంగా ఛాంబర్

కడప కార్పొరేషన్: కడప నగరంలోని కో ఆపరేటివ్ కాలనీలో కళావతి హాస్పిటల్ ఎదురుగా వైఎస్సార్ విగ్రహం వద్ద ఉన్న కేబుల్ ఛాంబర్ ప్రమాదకరంగా ఉంది. రోడ్డుకు సమాంతరంగా ఉండాల్సిన ఈ ఛాంబర్ మూత, దాని కంటే ఎత్తులో ఉండి విరిగిపోయింది. ఛాంబర్‌పైన ఉన్న కడ్డీలు ప్రమాదకరంగా ఉన్నాయి. దారికి అడ్డంగా ఉన్న ఈ ఛాంబర్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. వాహనదారులు అదుపుతప్పి వీటిపై పడినా ప్రమాదం జరుగక తప్పదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


కో ఆపరేటివ్ కాలనీలో కళావతి హాస్పిటల్ ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న ఛాంబర్

హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలి

కడప కార్పొరేషన్ : ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శుక్రవారం పంచాయతీరాజ్, సోషల్ వెల్ఫేర్ అధికారులతో కలిసి ప్రభుత్వ కళాశాల బాయ్స్ హాస్టల్, సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్, ప్రభుత్వ బాలికల-1, 2 హాస్టళ్లతోపాటు ఇతర హాస్టళ్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలని, మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఎలక్ట్రికల్ పనులు చేయించి నీరు నిలబడే ప్రాంతాలను మట్టితో పూడ్చాలన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఎటువంటి సమస్యలు లేకుండా మరమ్మతులు చేయాలన్నారు. హాస్టళ్లలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.


హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్

నేడు ఎల్ఐసీ యూనియన్ శిక్షణా తరగతులు

కడప కల్చరల్ : ఇన్‌స్రూ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కడప డివిజన్ ఆధ్వర్యంలో శనివారం యూనియన్ శిక్షణా తరగతులను నిర్వహించనున్నామని సంఘం డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి, మహిళా కన్వీనర్ అమీనా పర్వీన్ తెలిపారు. ఈ తరగతులకు జిల్లా బీమా సిబ్బంది హాజరవుతారని తెలిపారు. నేడు బీమా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, ఎల్ఐసీ సాధిస్తున్న విజయాలు, భవిష్యత్ లక్ష్యాలు, కర్తవ్యాలను ఈ శిక్షణా తరగతుల్లో వివరిస్తారని తెలిపారు. సంఘం అఖిల భారత ఉపాధ్యక్షులు పి.సతీష్ ముఖ్య అతిథిగా, జోనల్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య హాజరు కానున్నట్లు తెలిపారు.

రేపు లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కడప కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 6.00 గంటలకు కడప లోని మానస ఇన్ హోటల్‌లో నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు లయన్ డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, కార్యదర్శి లయన్ వి.గౌరీశంకర్ తెలిపారు. కార్యక్రమానికి చాప్టర్ ప్రెసిడెంట్ లయన్ పి.ఖాసిం ఖాన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, పీఎంజేఎఫ్ లయన్ కె.చిన్నపరెడ్డి ప్రధాన సందేశం ఇస్తారన్నారు. లయన్ సీహెచ్ రమేష్‌నాథ్‌రెడ్డి ప్రమాణ స్వీకార అధికారిగా వ్యవహరిస్తారని, లయన్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి నూతన సభ్యులను పరిచయం చేస్తారన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా పోతుల వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా వలీకల గౌరీశంకర్, కారపురెడ్డి చంద్ర ఓబుల్‌రెడ్డి, కార్యదర్శిగా కొండూరు జనార్దన్‌రాజులను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సహ కార్యదర్శిగా బోగాల కొండారెడ్డి, కోశాధికారిగా దేవతి రవీంద్రనాథ్, సహ కోశాధికారిగా ముఖేష్‌కుమార్‌లను ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ


పాఠశాలలకు తరలిస్తున్న పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు

కడప ఎడ్యుకేషన్: కడప మండల పరిధిలో 1 నుంచి 10వ తరగతి వరకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేశామని కడప ఎంఈఓలు పాలెం నారాయణ, ఇర్షాద్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న విద్యాకానుకలో భాగంగా సెమిస్టర్-1 పాఠ్యపుస్తకాలు ఇప్పటికే పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు. తాజాగా సెమిస్టర్-2 పుస్తకాలను కూడా అందజేశామన్నారు.

25న అభ్యుదయ సాహిత్య ఉపన్యాసం

కడప కల్చరల్ : స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈనెల 25న ఉదయం 10 గంటలకు అభ్యుదయ సాహిత్య ఉపన్యాసం నిర్వహించనున్నామని వైవీయూ సభ్య కార్యదర్శి, కుల సచివులు ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రముఖ బాల సాహిత్య రచయిత డీకే చదువులబాబు విశిష్ట అతిథిగా, కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్ గౌరవ అతిథిగా హాజరు కానున్నట్లు వివరించారు. ద్రవిడ విశ్వవిద్యాలయం తెలుగు, అనువాద అధ్యయనాల విభాగం అధ్యక్షులు ఆచార్య కిన్నెర శ్రీదేవి ప్రధాన వక్తగా వ్యవహరిస్తారన్నారు. అభ్యుదయ సాహిత్య ఉపన్యాసాల వ్యవస్థాపకులు, సాహిత్యవేత్తలు డాక్టర్ పి.సంజీవమ్మ, డాక్టర్ టక్కోలు మాచిరెడ్డి అతిథులుగా హాజరవుతారన్నారు. ఈ సదస్సులో వక్త వైఎస్సార్ జిల్లా అభ్యుదయ నవలా సాహిత్యం అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కను నాటాలి


మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

కడప ఎడ్యుకేషన్: వాతావరణంలో పెరిగిన కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పెంచాలని, వాతావరణ సమతుల్యతను కాపాడాలని మౌలాన అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల (మను) ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం మను పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హకీముద్దీన్, మీర్జా విలయత్ అలబైగ్, సోయబ్, ఆష్రాఫ్, నసార్ తదితరులు పాల్గొన్నారు.